నియోజకవర్గ అభివృద్ధికి కృషి



నేతలతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలోని పలు బస్తీలు, కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని నివాసంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమ సంఘాల నేతలు ఆయనను కలిశారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న దాతలు

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థికసాయం అందజేయడం సంతోషాన్ని ఇస్తుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ స్వప్న అన్నారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామానికి చెందిన పానుగోతు లక్ష్మి ఎన్ఐటీలో ర్యాంకు సాధించింది. లక్ష్మికి అడ్మిషన్ ఫీజు కోసం డబ్బు అవసరం అని హార్ట్ టూ హెల్ప్ సంస్థ ద్వారా తెలుసుకున్న ఏఈ స్వప్న మంగళవారం జీడిమెట్లలో విద్యార్థిని లక్ష్మికి రూ.15వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో హార్ట్ టు హెల్ప్ ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవినాయక్, భరత్, కరుణాకర్, మహేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

కుత్బుల్లాపూర్: ఇంటి యజమానులు తమ ఇంటి భద్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లో మంగళవారం సంక్షేమ సంఘాలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ సంఘాలు ఆయా ప్రాంతాల్లో కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలి



పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను వీక్షిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



హాజరైన నాయకులు, కార్యకర్తలు

- కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

దుండిగల్: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని, కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యేలు వివేకానంద్, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలోని బీఆర్ఎస్ భవన్ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గండి మైసమ్మలోని పార్టీ జిల్లా కార్యాలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలతో వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల కాలంలో తన బృహత్తర ప్రణాళికలతో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టు నిర్మించి రైతన్న కళ్లల్లో ఆనందం నింపారన్నారు. నాడు దండుగగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పండుగగా మార్చిన గొప్ప నేత కేసీఆర్ అని అన్నారు. హరీష్‌రావు ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకత, ఇంత భారీ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగానికి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే వివేకానంద్



ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతిప్రతం అందజేస్తున్న సంక్షేమ సంఘాల ప్రతినిధులు

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలపై అధికారులు త్వరితగతిన స్పందించాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల వాసులు మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మంజీరా నీటి సరఫరా, తాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న బస్తీలు, కాలనీల జనాభాను దృష్టిలో ఉంచుకుని తాగునీటి పైపులైన్ వ్యవస్థను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన తాగునీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, యువజన విభాగం డివిజన్ అధ్యక్షుడు దొడ్ల శ్రీనివాస్, సంక్షేమ సంఘాల సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, దారం శివ గుప్తా, యాదయ్యగౌడ్, సురేష్ బాబు, మహేష్, సత్తి, సదానందం, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థలం కబ్జా.. హైడ్రా పరిశీలన



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా సీఐ నరేష్

చింతల్: భగత్‌సింగ్‌నగర్‌లోని సర్వే నంబర్ 150లో ఉన్న 3550 గజాల ప్రభుత్వ స్థలంలో ఇటీవల నిర్మించిన గదులు, గుడి ప్రహరీ నిర్మాణాలపై భగత్‌సింగ్ నగర్ మాజీ అధ్యక్షుడు అల్లా బకాష్ సోమవారం హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హైడ్రా సీఐ నరేష్ ఈ స్థలాన్ని పరిశీలించారు.

మందుబాబులకు జైలు శిక్ష

సుభాష్‌నగర్: మద్యం సేవించే వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ ఇద్దరికి మేడ్చల్ మెజిస్ట్రేట్ జైలు శిక్ష విధించింది. జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఈ నెల 4న డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టగా జయరామ్‌నగర్‌కు చెందిన రాజేష్, బోయిన్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిని సోమవారం కోర్టులో హాజరుపరచగా రాజేష్, వెంకటేశ్వరరెడ్డిలకు రెండు రోజులు జైలు శిక్ష విధించగా.. మంగళవారం చర్లపల్లి జైలుకు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేత



కుత్బుల్లాపూర్: బాచుపల్లి సర్వే నంబర్ 186 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను మంగళవారం అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ పూల్‌సింగ్ ఆదేశాల మేరకు కూల్చివేసినట్లు ఆర్ఐ భాను తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు హెచ్చరించారు.

ఎస్ఐ ప్రేమ్‌సాగర్‌కు ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందజేస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

జీడిమెట్ల: తెలంగాణ రెండవ పోలీస్ డ్యూటీమీట్‌లో అత్యధిక ప్రతిభ కనబరిచిన జీడిమెట్ల ఎస్ఐ ప్రేమ్‌సాగర్‌ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అభినందించారు. జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్‌లో తెలంగాణ రెండవ డ్యూటీమీట్ కార్యక్రమాలను నిర్వహించారు. మూడు రోజుల పాటు సాగిన డ్యూటీమీట్‌లో జీడిమెట్ల ఎస్ఐ ప్రేమ్‌సాగర్ క్రిమినల్ లాస్‌లో గోల్డ్ మెడల్, లిఫ్టింగ్ ప్యాకింగ్ పార్వర్డింగ్‌లో సిల్వర్ మెడల్, మెడికల్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు. మూడు విభాగాల్లో మెడల్స్ సాధించినందుకు సైబరాబాద్ సాంక్షన్‌షిప్ లభించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సందర్భంగా సైబరాబాద్ సీపీ పుష్పగుచ్ఛం అందజేశారు. విషయం తెలుసుకున్న బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ నరేష్ రెడ్డిలు ప్రేమ్‌సాగర్‌కు అభినందనలు తెలియజేశారు. మంగళవారం సాయంత్రం జీడిమెట్ల పీఎస్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. పలువురు సన్మానించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌బాక్స్‌కు మూత ఏర్పాటు



కథనానికి ముందు మూత లేకుండా..



కథనం తర్వాత ఫ్యూజ్‌బాక్స్‌కు మూత

సాక్షి ఎఫెక్ట్..

రంగారెడ్డినగర్: మూత లేకుండా ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్‌బాక్స్‌కు ఎట్టకేలకు విద్యుత్ శాఖ అధికారులు మూత ఏర్పాటు చేశారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి రంగారెడ్డినగర్‌కు నందా ఫుడ్ కంపెనీ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్‌బాక్స్‌కు కొన్ని నెలలుగా మూత లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. పశువులతో పాటు అటుగా వచ్చిపోయే చిన్నారులు ప్రమాదవశాత్తు దాన్ని ముట్టుకుంటే వారి ప్రాణాలకే అపాయమని 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ఇటీవల ఫ్యూజ్‌బాక్స్‌కు మూతలు ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీకి బీసీ సంఘాల వినతి



తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: తెలంగాణ 27 క్యాస్ట్ బీసీ అసోసియేషన్ అధ్యక్షుడు గుత్తుల మీరా కుమార్ ఆధ్వర్యంలో పలువురు మంగళవారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి వినతిపత్రం అందజేశారు.ఆంధ్ర ప్రదేశ్‌కి సంబంధించిన కులాలను తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబర్ 3ని తీసుకువచ్చి 27 కులాలను బీసీ జాబితా నుంచి తొలగించిందని వివరించారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జి. లక్ష్మీనారాయణ, కేవీ రావు, వాసంశెట్టి రాజబాబు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ నాయుడు, ట్రెజరర్ డి కృష్ణం నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ గుబ్బల లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ సాయి కృష్ణ, జాయింట్ సెక్రటరీ పిల్లి నాగ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.